
సాక్షి అనకాపల్లి

బుధవారం : 24 : జూలై : 2024

విశాఖ సిటీ: విశాఖపై ఈసారి కూడా నిర్మలమ్మ కరుణించలేదు. కూటమి ప్రభుత్వ హయాంలో కూడా జిల్లాకు రిక్తహస్తమే చూపించారు. రైల్వే జోన్ ఊసేలేదు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై భరోసా ఇవ్వలేదు. ఎప్పటిలాగే విశాఖ–చెన్నై కారిడార్ జపం చేసినా.. నిధులు మాత్రం విదల్చలేదు. అలాగే నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్, స్టార్టప్ పార్క్‌ల ప్రస్తావనే లేదు. మొత్తంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో సమర్పించిన 2024–25 బడ్జెట్ విశాఖకు ఎప్పటిలాగే నిరాశను మిగిల్చింది. ఎన్డీయే కూటమిలో ప్రధాన మిత్రపక్షంగా చంద్రబాబు ప్రభుత్వం ఉన్నప్పటికీ దీర్ఘకాల విశాఖ ప్రజల ఆకాంక్షలు, ప్రాజెక్టులు, అభివృద్ధి అంశంలో కేంద్రాన్ని ఒప్పించడంలో ఘోరంగా విఫలమయ్యారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ముందు ప్రధాని మోదీ అనకాపల్లి నియోజకవర్గంలోని తాళ్లపాలెం సభలో మాట్లాడుతూ.. నక్కపల్లిలో డ్రగ్ పార్కును శరవేగంగా పూర్తి చేస్తామని, విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వేజోన్ ఇవ్వడానికి ఎన్డీఏ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆ హామీలన్నీ నీటిమూటలేనని తేలిపోయింది.



మరోసారి తీవ్ర ద్రోహం



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం మరోసారి తీవ్ర ద్రోహం చేసింది. అమరావతి నిర్మాణానికి పలు ఆర్థిక సంస్థల ద్వారా రూ.15 వేల కోట్లు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ఈ సొమ్మును అప్పు రూపంలో కాకుండా గ్రాంట్ల రూపంలో అందించి ఉంటే కొంత ఆర్థిక ఉపశమనం కలిగేది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్‌కు నిధులు కేటాయించలేదు. పదేళ్లుగా రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు మోదీ సర్కారు ద్రోహం చేస్తూనే ఉంది. పోలవరానికి రూ. 12 వేల కోట్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం కోరినప్పటికీ బడ్జెట్‌లో స్పష్టమైన హామీ లేదు.

–కె.లోకనాథం, సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి

అభివృద్ధి, ఉపాధికి తోడ్పడని బడ్జెట్



'వికసిత భారత్'కు ఈ బడ్జెట్ తోడ్పడుతుందని మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. తీరా చూస్తే బడ్జెట్ తీవ్ర నిరాశ కలిగించింది. ప్రతీ ఏడాది కోటి మందికి ఉపాధి కల్పించేందుకు మూడు పథకాలు ప్రవేశపెట్టామని ఆర్థిక మంత్రి గొప్పగా చెప్పారు. వాస్తవంగా ఈ పథకాలు ఉపాధి పెంచేవి కావు. 2022 – 2023 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ఉపాధికి ఖర్చు చేసిన మొత్తం కంటే ఈ బడ్జెట్లో చేసిన కేటాయింపు తక్కువగా ఉంది. ప్రచారమే తప్ప అభివృద్ధికి, ఉపాధికి తోడ్పడని బడ్జెట్ ఇది.

– కోటేశ్వరరావు, సీఐటీయూ అనకాపల్లి జిల్లా కార్యదర్శి

రైల్వే జోన్ ఊసేలేదు..!




విశాఖ వాసుల దీర్ఘకాల డిమాండ్ ప్రత్యేక రైల్వే జోన్‌కు ఈ సారి కూడా బడ్జెట్‌లో చోటు కల్పించలేదు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో అంశమైనప్పటికీ.. ఇప్పటికీ రైల్వే జోన్‌ను పట్టాలెక్కించే విషయంపై ఎన్డీయే ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్థలం కేటాయించని కారణంగా జోన్ ఏర్పాటు ఆలస్యమవుతోందని కేంద్రం పార్లమెంట్ సాక్షిగా నిస్సిగ్గుగా అబద్ధాలు వల్లె వేసింది. వాస్తవానికి 2014–2019 మధ్యే రైల్వే జోన్‌కు స్థలాన్ని కేటాయించాల్సి ఉండగా.. అప్పటి టీడీపీ ప్రభుత్వం కనీసం ఆ విషయాన్ని పట్టించుకోలేదు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముడసర్లోవ ప్రాంతంలో సుమారు 53 ఎకరాలను సేకరించింది. ముందు కొంత స్థలంలో ఆక్రమణలు ఉండగా.. వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించడంతో కొంత జాప్యం జరిగింది. జోన్‌కు అవసరమయ్యే 53 ఎకరాల్లో హద్దులు వేసి మరీ రైల్వే అధికారులకు అప్పగించింది. అయినా రైల్వే జోన్ కోసం నిర్మాణాలు చేపట్టకుండా స్థలం కేటాయించలేదని ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేశాయి. దీనిపై అప్పటి కలెక్టర్ స్థలాన్ని రైల్వే అధికారులకు అందించినట్లు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైల్వే జోన్ పనులు ప్రారంభమవుతాయని ఎన్నికల ప్రచారాల్లో ఊదరగొట్టాయి. కానీ అధికారం చెపట్టిన తరువాత కేంద్రం ప్రత్యేక జోన్ విషయాన్ని విస్మరించింది. బడ్జెట్‌లో 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' ప్రస్తావనే చేయలేదు. దీనిపై వామపక్ష పార్టీలు, రైల్వే పరిరక్షణ సంఘం ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే జోన్‌కు స్థలాన్ని కేటాయించినా బడ్జెట్‌లో చోటు కల్పించకపోవడం పట్ల మండిపడుతున్నారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు విశాఖ స్టేషన్ ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు.

స్టీల్‌ప్లాంట్‌పై భరోసా ఏది?



విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. ఉక్కు పరిశ్రమ మూలధనాన్ని సమీకరించుకునే విషయంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా.. బడ్జెట్‌లో సంస్థ మనుగడకు ఒక్క పైసా కూడా విదల్చలేదు. మూల ధన వ్యయాన్ని అధిగమించేందుకు సొంత గనులు కేటాయించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆ దిశగా కనీసం ఆలోచన చేయలేదు. ఒకవైపు క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కోసం పలు మెట్రో నగరాల్లోని పరిశ్రమకు చెందిన నిరర్థక ఆస్తుల విక్రయాలకు ప్లాంట్ యాజమాన్యం సిద్ధమైంది. దీనిపై అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ఎన్నికలకు ముందు స్టీల్‌ప్లాంట్‌ను అన్ని విధాల ఆదుకుంటామని కూటమి పార్టీలు హామీలు గుప్పించాయి. ప్రధానంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్‌ప్లాంట్‌కు నిధులు సమకూర్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామని గొంతులు చించుకున్నారు. అధికారంలోకి వచ్చాక ఆ గొంతులు మూగబోయాయి. నష్టాల ఊబి నుంచి స్టీల్‌ప్లాంట్ బయట పడేందుకు నిధులు కేటాయించాలని ఒక్కసారి కూడా కేంద్రాన్ని అడిగిన పాపాన పోలేదు. మూలధన సమీకరణ, ఉత్పాదక వ్యయం పెరుగుదల వంటి కారణాలు చూపించి ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలన్న ఆలోచనలో భాగంగానే బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఎప్పటిలాగే విశాఖ–చెన్నై కారిడార్ జపం



ఎప్పటిలాగే ఈ బడ్జెట్‌లో కూడా కేంద్రం విశాఖ–చెన్నై కారిడార్ జపం చేసింది. 2014 నుంచి ప్రతి బడ్జెట్‌లోను ఈ కారిడార్ ప్రస్తావన సర్వ సాధారణమైపోయింది. ఈ కారిడార్ ద్వారా పరిశ్రమలు క్యూ కడతాయని ప్రతిసారి విశాఖవాసుల్లో ఆశలు రేకెత్తిస్తూ వస్తున్నారే తప్ప.. ఇప్పటి వరకు పైసా కూడా కేటాయించలేదు. ఈసారి కూడా విశాఖ–చెన్నై కారిడార్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పినప్పటికీ.. ఎంత కేటాయింపులు చేస్తున్నామన్న విషయాన్ని మాత్రం ప్రకటించలేదు. దీంతో ఈ దఫా కూడా ఎప్పటిలాగే కారిడార్ ప్రకటనతోనే సరిపెడతారా? లేదా నిధులు కేటాయించి కారిడార్‌ను అభివృద్ధి చేస్తారా? అన్నది వేచి చూడాలి మరి.

కూటమి అట్టర్‌ఫ్లాప్



ఎన్నికలకు ముందు కూటమి పార్టీల నేతల హామీలు కోటలు దాటాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే రైల్వే జోన్ పనులు ప్రారంభించేస్తామని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్రాన్ని ఒప్పిస్తామని, విశాఖ–చెన్నై కారిడార్ అభివృద్ధితో అనేక పెట్టుబడులను తీసుకువస్తామని.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. అడ్డూ అదుపూలేని హామీలతో చంద్రబాబు అండ్ కో విశాఖ ప్రజల నోట్లో బూరెలు వండేశారు. అది నిజమని నమ్మిన జిల్లా ప్రజలు కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారు. కేంద్రాన్ని శాసించే స్థాయిలో అధికారాన్ని కట్టబెట్టినా.. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు మాత్రం ఎన్డీయేకు సాగిలపడుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో అంశాలపై గానీ, తెలుగువారి ఆత్మగౌరవంతో ముడిపడిన పరిశ్రమల పరిరక్షణ విషయంలో గానీ వీరు కనీసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యారు.

వినియోగదారుల హక్కులకు రక్షణేదీ?



వినియోగదారుల హక్కుల రక్షణకు బడ్జెట్‌లో కనీస ప్రాధాన్యం దక్కలేదు. ఒక దేశ ఆర్థిక వ్యవస్థ వినియోగదారులపై ఆధారపడి ఉందన్న విషయాన్ని గుర్తించకపోవడం సిగ్గుచేటు. ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాలు, ఈ–కామర్స్ వినియోగదారుల రక్షణ, వినియోగదారుల కమిషన్ల పరిపుష్టికి అధిక ప్రాధాన్యం ఇస్తామని, ఆహార కల్తీ నిరోధానికి నిధులు కేటాయిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఆ ఊసెత్తకపోవడం విచారకరం.

–కాండ్రేగుల వెంకటరమణ, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

బల్క్ డ్రగ్ పార్క్ ఎక్కడ?



కేంద్ర బడ్జెట్‌లో నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్ ప్రస్తావనే లేదు. అనకాపల్లి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అప్పట్లో కేంద్రం సూచనల మేరకు బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం 5 వేల ఎకరాలను కేటాయించింది. ఇందులో స్టార్టప్ ఏరియా కింద 1100 ఎకరాలను సిద్ధం చేయడంతో పాటు రూ.399 కోట్లు మంజూరు చేసింది. ఇక్కడ భారీ స్థాయిలో ఫార్మా కంపెనీలు ఏర్పాటవుతాయని అందరూ భావించారు. పనులు ప్రారంభించిన సమయంలో 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రైతులకు చెల్లించాలని టీడీపీ నేతలు అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతులకు పరిహారాన్ని చెల్లించి పనులు చేపడతామని ఎన్నికలకు ముందు హామీలు గుప్పించారు. అయితే ఈ బడ్జెట్‌లో ఈ పార్క్‌ను పూర్తిగా విస్మరించారు. పారిశ్రామికంగా అనకాపల్లి జిల్లా స్వరూపాన్ని మార్చే అవకాశమున్న ప్రాజెక్టును కనీసం పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు.

ఏపీకి మరోసారి మోసం

తాటిచెట్లపాలెం (విశాఖ): బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మరోసారి తీవ్ర అన్యాయం చేసిందని సీపీఐ నాయకులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్ తీరును నిరసిస్తూ మంగళవారం రైల్వేస్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించినట్లు చెబుతున్నా అది నమ్మశక్యం కాదని తెలిపారు. పోలవరం కోసం ఒక రూపాయి కేటాయింపు లేదని మండిపడ్డారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఊసే లేదని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా కాపాడుతామని గానీ సెయిల్‌లో విలీనం చేస్తామని గానీ ప్రకటించలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్.కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, ఆర్.శ్రీనివాస రావు, నాయకులు జె.డి.నాయుడు, ఎస్.నాగభూషణం, వై.రాంబాబు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

ప్రత్యేక హోదా ఏది..?



కేంద్రంలో చక్రం తిప్పేలా ఏపీ ప్రజలు చంద్రబాబుకు మెజారిటీ ఇచ్చినప్పటికీ.. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో అట్టర్ ఫ్లాప్ అయ్యారు. ప్రత్యేక హోదా అంశంలో కేంద్రాన్ని ఒప్పించడంలో విఫలమయ్యారు. భారీగా నిధులు రాబట్టలేకపోయారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కనీసం స్పష్టమైన హామీ ప్రకటన కూడా చేయించుకోలేకపోయారు. ప్రత్యేక హోదా అనే పదాన్ని ప్రస్తావించకుండానే ప్రత్యేక సాయం ప్రకటన చేసింది కేంద్రం. కీలకమైన పోలవరం ప్రాజెక్టుకు అందించే సాయం మీదా సీతారామన్ స్పష్టమైన ప్రకటన చేయలేదు.

– వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ

సీఆర్‌జెడ్ పరిధి విస్త'రణం'



కలెక్టర్ విజయ కృష్ణన్ అధ్యక్షతన సీజెడ్ఎంపీ–2019పై ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తూ వివిధ గ్రామాల ప్రజలు చేసిన తీర్మానాన్ని కలెక్టర్‌కు అందిస్తున్న వీసం రామకృష్ణ తదితరులు

- సీజెడ్ఎంపీ–2019 అమలుకు స్థానికులు ససేమిరా
- ప్రజాభిప్రాయ సేకరణలో ముక్త కంఠంతో వ్యతిరేకత
- గ్రామ స్థాయిలో ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవాలని డిమాండ్

తుమ్మపాల/నక్కపల్లి: కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ (సీజెడ్ఎం) ప్లాన్–2019 అమలుపై స్థానికుల నుంచి నిరసన వెల్లువెత్తింది. ప్రభావిత ప్రాంతాల్లో గ్రామ సభల ద్వారా అభిప్రాయ సేకరణ జరపకుండా, పత్రికల్లో ప్రకటన ఇచ్చి, 60 కి.మీ. దూరంలో ఉన్న కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరపడంపై మండిపడ్డారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేసి, సీఆర్‌జెడ్ పరిధి విస్తరణ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. జిల్లాలో సముద్ర తీర ప్రాంతానికి సంబంధించి తీరప్రాంత నియంత్రణ మండలి(సీఆర్‌జెడ్) నోటిఫికేషన్ ప్రకారం కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్(సీజెడ్ఎంపీ)–2019 అమలుకు సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయ కృష్ణన్ అధ్యక్షతన మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. తొలుత ఏపీ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ), సీఆర్‌జెడ్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సీజెడ్ఎంపీ–2019 ముసాయిదాపై ప్రజాప్రతినిధులకు, ప్రజా సంఘాల నాయకులకు అవగాహన కలిగించారు. కలెక్టర్ అందరితో చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆయా అంశాలపై ప్రజా సంఘాల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ప్రజాభిప్రాయ సేకరణలో లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆమె చెప్పారు.

ప్రజాభిప్రాయ సేకరణ రద్దుకు డిమాండ్

సీఆర్‌జెడ్ పరిధిని విస్తరించేందుకు ప్రతిపాదించిన సీజెడ్ఎంపీ–2019 ఆమోదం కొరకు ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని పలు పార్టీల నాయకులు, ప్రభావిత ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. నక్కపల్లి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, కాంగ్రెస్, ఇతర పార్టీల, సంఘాల స్థానిక నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రైతులు తమ వ్యతిరేకతను తెలిపారు. ఈ సందర్భంగా వీసం రామకృష్ణతోపాటు వారు మాట్లాడుతూ సముద్రతీరానికి కేవలం 500 మీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలనే ఇప్పటి వరకు సీఆర్‌జెడ్ పరిధిగా గుర్తించారని, ఇప్పుడు దాన్ని 5 కి.మీ. వరకు విస్తరించడం అన్యాయమన్నారు. ఇదే జరిగితే నివాస ప్రాంతాలన్నీ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లి, పరిశ్రమలు ఏర్పాటుకాక, ఉపాధి అవకాశాలు దూరమవుతాయన్నారు. ప్రభావిత గ్రామాల్లో, సమీప మండల కార్యాలయాల్లో అభిప్రాయ సేకరణ చేస్తే బాధితులంతా తమ అభ్యంతరాలను నివేదించుకుంటారని పేర్కొన్నారు. 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రంలో ప్రజాభిప్రాయ సేకరణ జరపడం పట్ల నిరసన తెలిపారు. తక్షణమే ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి ప్రజాభిప్రాయసేకరణను రద్దు చేయడంతోపాటు, కొత్త నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు జి.నాయనబాబు, రైతు నాయకులు బుద్ధ రంగారావు, ఎస్.బ్రహ్మాజీ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శివాజీ, సీపీఎం నక్కపల్లి మండల కార్యదర్శి ఎం.రాజేష్, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మత్స్యకార సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతు సంఘం నాయకులు, ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొని, తమ అభిప్రాయాలను నివేదించారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, టూరిజం అధికారులు ముసాయిదా ప్లాన్‌పై వివరణ ఇచ్చారు.

సమన్వయంతో విశాఖ అభివృద్ధికి కృషి

- విశాఖ నగర మార్పుకు 100 రోజుల ప్రణాళిక
- జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంపత్‌కుమార్



డాబాగార్డెన్స్ (విశాఖ): నగర ప్రజల ఆకాంక్షకు, నగరాభివృద్ధికి అనుగుణంగా తాను పని చేస్తానని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. తన చాంబర్‌లో మంగళవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా పనిచేసే అవకాశం తనకు వచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకుంటానని చెప్పారు. విశాఖ అందమైన నగరమని, ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పని చేస్తానని చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మిషన్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విశాఖలో పర్యటించానని గుర్తు చేశారు. లెగసీ వేస్ట్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ మొదటి ర్యాంకులో నిలిచేలా కృషి చేస్తానన్నారు.

సిబ్బందిని క్రమ శిక్షణలో నడిపిస్తా..

విశాఖ నగర మార్పుకు 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేసుకుని పనులు పూర్తి చేస్తానని, మరీ ముఖ్యంగా ఉద్యోగులు, అధికారులను క్రమశిక్షణతో నడిపిస్తానన్నారు. ప్రతీ నెలలో రెండు, మూడు రోజులు ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించి ఉద్యోగులకు సమయం కేటాయిస్తానని, వారి సమస్యలు వీలైనంత వరకు వెంటనే పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా విశ్వనాథన్ బాధ్యతలు



విశాఖ సిటీ: విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) కమిషనర్‌గా కె.ఎస్. విశ్వనాథన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా సంస్థ జాయింట్ కమిషనర్ రవీంద్ర వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా ఉన్న విశ్వనాథన్‌ను ప్రభుత్వం ఇటీవలే వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా నియమించింది. మంగళవారం చార్జ్ తీసుకున్న విశ్వనాథన్‌కు జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ప్రధాన ఇంజనీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజనీర్ బలరామరాజు, డీఎఫ్ఓ శాంతి స్వరూప్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, సీయూపీ సంజయ్‌రత్న కుమార్, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

మెడికల్ పింఛన్లకు డీఎంహెచ్‌వో ధ్రువీకరణ తప్పనిసరి

తుమ్మపాల: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందించే సామాజిక పింఛన్లలో మెడికల్ కోటాలో దరఖాస్తు చేస్తున్న అభ్యర్థులు సదరం సర్టిఫికెట్‌తో పాటు డీఎంహెచ్‌వో మంజూరు చేసిన వ్యాధి నిర్ధారణ ధ్రువపత్రం నకళ్లను సమర్పించాలని డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సదరం సర్టిఫికెట్ ఎక్కువ శాతం ఉన్నవారంతా సాధారణ పింఛన్ కంటే మెడికల్ పింఛన్ కోసం దరఖాస్తులు చేస్తున్నారని పేర్కొన్నారు. మెడికల్ పింఛన్లలో కొన్ని ప్రమాణాలు, ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరన్నారు. సదరం సర్టిఫికెట్‌లో ఎక్కువ శాతం వైకల్యం ఉన్నంత మాత్రాన మెడికల్ పింఛన్ ఇవ్వడం కుదరదన్నారు.

చెరువుల పరిరక్షణే ధ్యేయం


వెంకట రమణారావు

నాతవరం : చెరువులు పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్‌గా లాలం వెంకటరమణరావును నియమించారు. ఇటీవల విజయనగరంలో రాష్ట్ర అధ్యక్షుడు మరిచర్ల కృష్ణమూర్తినాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సమితి కన్వీనర్‌గా వెంకటరమణరావును నియమించినట్టు ఆయన మంగళవారం నాతవరంలో విలేకరులకు తెలిపారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణమూర్తి నాయుడుకు, ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘుచక్రవర్తికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎంతో కాలంగా ఆక్రమణకు గురైన చెరువులను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. వ్యవసాయ రైతులు సాగునీటికి ఇబ్బందులు లేకుండా చెరువులను కాపాడమే ధ్యేయంగా పని చేస్తానన్నారు. చెరువుల అభివృద్ధి అంశం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులతో కలిసి ఉద్యమిస్తానన్నారు.

స్వర్ణకారుల సంక్షేమానికి కృషి



అనకాపల్లి : జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షునిగా వెదురుపర్తి సుందరయ్య (బాబి)ని నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ మంగళవారం నియమక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల పాటు పదవి కొనసాగుతుందని, త్వరలో జిల్లాల్లో 24 మండలాల సంఘం కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించి పూర్తి స్థాయిలో జిల్లా కమిటీ నియమకం చేపడతామన్నారు. జిల్లాలో స్వర్ణకార కుటుంబాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

తగ్గిన వరద ఉధృతి


విజయరామరాజుపేటలో డైవర్షన్ రోడ్డు పనులు


వడ్డాది పెద్దేరు డైవర్షన్ వద్ద నీటి ప్రవాహం తగ్గడంతో మొదలైన వాహనాల రాకపోకలు

- వడ్డాదిలో డైవర్షన్ రోడ్డుపై నుంచి రాకపోకలు
- పేట డైవర్షన్ రోడ్డు పనులు వేగవంతం
- నేటి నుంచి బీఎన్ రోడ్డులో వాహనాల రాకపోకలు

బుచ్చెయ్యపేట : మండలంలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. మంగళవారం కొద్దిపాటి చిరు జల్లులు తప్ప వర్షం కురవలేదు. ఐదో రోజు తెరిపివ్వడంతో ప్రజలు తమ పనులు ఎప్పటిలా చేపట్టారు. మూడు రోజులుగా మూతపడ్డ పాఠశాలలు తెరుచుకున్నాయి. వర్షం తగ్గడంతో పెద్దేరు, తాచేరు నదుల్లో నీటి ఉధృతి తగ్గింది. వడ్డాది డైవర్షన్ రోడ్డుపై నుంచి వరద నీరు తగ్గడంతో వాహనాల రాకపోకలు సాగాయి. విజయరామరాజుపేట తాచేరు నదిలో నీటి ప్రవాహం తగ్గడంతో వర్షానికి పడ్డ గండిని అధికారులు పూడ్చి వేయించారు. డైవర్షన్ రోడ్డు గండిని పూడ్చి గోతుల్లో మట్టి గ్రావెల్ వేసి లెవెలింగ్ చేస్తున్నారు. రాత్రికి డైవర్షన్ రోడ్డు పనులు పూర్తి చేసి బుధవారం ఉదయం నుంచి వాహనాలు విడిచిపెట్టి డైవర్షన్ రోడ్డుపై నుంచి వాహనదారులకు రవాణా సదుపాయం కల్పిస్తామని చోడవరం సెక్షన్ ఆర్‌అండ్‌బీ జేఈ సత్య ప్రకాష్ తెలిపారు. భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో తాచేరు డైవర్షన్ రోడ్డు గండి పడడంతో నాలుగు రోజులుగా వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. డైవర్షన్ రోడ్డు పనులు పూర్తి చేయడంతో బుధవారం నుంచి విశాఖపట్నం, నర్సీపట్నం, పాడేరు, అనకాపల్లి, చోడవరం, మాడుగుల తదితర ప్రాంతాలకు వెళ్లే మూడు జిల్లాల ప్రయాణికులకు రవాణా సదుపాయం కలుగుతుంది.

యలమంచిలి మీదుగా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు

- 15ఏళ్ల సమస్య పరిష్కారం


యలమంచిలి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్

యలమంచిలి రూరల్: దశాబ్దంన్నరకు పైగా యలమంచిలి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యకు ప్రజా రవాణా అధికారులు పాక్షికంగా పరిష్కారం చూపారు. నియోజకవర్గ కేంద్రమైన యలమంచిలి ఆర్టీసీ బస్‌కాంప్లెక్స్‌కు అధికారులు పదిహేనేళ్లకు పైగా ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులు నిలిపివేశారు. 16వ నంబరు జాతీయ రహదారి బైపాస్ కావడం, పట్టణంలోకి వచ్చే మార్గంలో రైల్వేగేటు ఉండడంతో దూరప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులు హైవే మీదుగా నేరుగా వెళ్లిపోయేవి. కొక్కిరాపల్లి రైల్వేగేటు వద్ద 15 ఏళ్లుగా అసంపూర్తిగా వదిలేసిన ఆర్‌వోబీ (పై వంతెన) పనులను ప్రజల ఇబ్బందుల దృష్ట్యా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కన్నబాబురాజు పట్టుదలతో పూర్తి చేయించి వంతెనపై రాకపోకలు ప్రారంభించేలా చూశారు. ఆ తర్వాత సాధారణ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులను పట్టణం మీదుగా రాకపోకలు సాగించడానికి ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోలేకపోయారు. ఎన్నికల తర్వాత నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన సుందరపు విజయ్‌కుమార్ ఈ సమస్యపై దృష్టి సారించారు. ఈ నెల 4న విశాఖపట్నం ప్రజా రవాణా అధికారికి యలమంచిలి పట్టణంలోకి ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులను నడిపేలా చూడాల్సిందిగా వినతిపత్రం ఇచ్చారు. దీనికి స్పందించిన ప్రజా రవాణా శాఖ అధికారులు యలమంచిలి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ మీదుగా 6 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిపేలా మధురవాడ, మద్దిలపాలెం, విశాఖపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్లకు మంగళవారం రాత్రి ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు

విశాఖ-శ్రీశైలం (3383), విశాఖ-అమలాపురం(3327), విశాఖ-అమలాపురం(3405), విశాఖ-హైదరాబాద్(3375), విశాఖ-తిరుపతి(3479), విశాఖ-విజయవాడ(3487) ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులు రాను, పోను యలమంచిలి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ మీదుగా రాకపోకలు సాగించనున్నాయి.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు వర్ష సూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం పేర్కొన్నారు. ఈనెల 24న 10 మి.మీ., 25న 6, 26న 4, 27న 4, 28న 3 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉష్ణోగ్రతలు 29.7 నుంచి 31.2 డిగ్రీలు, గాలి గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీస్తుందని ఆమె చెప్పారు.

రక్షణ గోడ విరిగిపడి ఇద్దరికి గాయాలు

మధురవాడ: భారీ వర్షాలకు జీవీఎంసీ 5వ వార్డు స్వయంకృషినగర్ కొండవాలు ప్రాంతంలో ఉన్న నివాసాల రక్షణ గోడ, మట్టిచరియలు జారిపోవడంతో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. స్వయం కృషినగర్ వాటర్ ట్యాంకు సమీపంలోని 3వ వీధిలో రెండు నివాసాల వద్ద మట్టి తడసిపోయి జారిపోయే స్థితికి చేరుకుంది. దీంతో ఆ నివాసాల యజమానులు సూరిదేముడు, సురేష్ రక్షణ గోడ పునర్నిర్మాణానికి పూనుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నుంచి 8 మంది కార్మికులు గోతులు తవ్వి పిల్లర్లు నిర్మించే పనిలో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో పైన ఉన్న మట్టి చరియలు ఒక్కసారిగా జారిపోయాయి. దీంతో రోజువారీ కూలి పనుల నిమిత్తం వచ్చిన విశాఖ అప్పుఘర్ ప్రాంతానికి చెందిన గొట్యాడ జమ్మలయ్య (36), మద్దిలపాలెం ప్రాంతానికి చెందిన నడిపిల్లి శంకర్ (45)పై మట్టి పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు, సహచర కార్మికులు తేరుకుని సహాయక చర్యలు చేపట్టి రక్షించారు.

27న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట (విశాఖ): విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 27న ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుంది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని సీఈవో ఎం.పోలినాయుడు కోరారు.

అన్ని శాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు.

800 ఎకరాల్లో నీట మునిగిన నారుమడులు

- వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా
- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు


పెదనందిపల్లిలో వరి పంటను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

దేవరాపల్లి: తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో జిల్లాలో 800 ఎకరాల్లో వరి నారు నీట మునిగి దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు చెప్పారు. మండలంలోని చిననందిపల్లి, పెదనందిపల్లి గ్రామాల్లో మంగళవారం పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. పెదనందిపల్లిలో సాగు చేసిన జీలుగు పంటను పరిశీలించి దాని ద్వారా కలిగే ప్రయోజనాలను స్థానిక రైతులకు వివరించారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం క్రింద రైతులకు అందజేసిన శ్రీధృతి(1121) రకం విత్తనాలతో సాగు చేసిన వరి పంటలను, నారుమడులను పరిశీలించి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో 13 మండలాల్లో వరినారు మడులు దెబ్బతిన్నాయని, అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాల్లో అధిక నష్టం జరిగిందన్నారు. నారుమడుల్లో నీటి ముంపు తగ్గకపోతే అదనంగా 200 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. జిల్లాలో ఈ ఏడాది 5,560 మందికి కౌలు కార్డులు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత ఏడాది 4603 మందికి కౌలు కార్డులు మంజూరు చేశామన్నారు. జిల్లాలోని 753 రెవెన్యూ గ్రామాల్లో అర్హులైన కౌలు రైతులందరికీ కౌలు కార్డులు మంజూరు చేస్తామన్నారు. దేవరాపల్లికి చెందిన వరదపురెడ్డి ఎర్రినాయుడుకు కౌలు కార్డును ఆయన అందజేశారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగండి

- అధికారులకు ఎస్పీ దీపిక సూచన


సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ దీపిక

సబ్బవరం : వివిధ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలని ఎస్పీ ఎం.దీపిక సూచించారు. సబ్బవరం పోలీసు స్టేషన్‌ను ఎస్పీ దీపిక మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీచేశారు. పోలీసుస్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో ఉన్న సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. సీజ్ చేసిన వాహనాలకు ఆయా కేసుల వివరాలను ట్యాగ్ చేయాలని ఆదేశించారు. రౌడీ షీటర్స్, చెడునడత కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణాపై గట్టి నిఘా ఉంచి అక్రమ రవాణాకు కారకులైన ప్రధాన వ్యక్తులను గుర్తించి అరెస్టు చేయాలన్నారు. స్టేషన్ పరిధిలో గతంలో పట్టుబడిన గంజాయి కేసుల సీడీ ఫైల్స్, తీవ్రమైన కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి ఆయా కేసుల పురోగతిని తెలుసుకొని పలు సూచనలు చేశారు. విజబుల్ పోలీసింగ్ చేయాలని, నేర నియంత్రణకు, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, సబ్బవరం సీఐ పిన్నింటి వెంకట రమణతో పాటు మిగిలిన సిబ్బంది పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కోటాలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం


కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైన అన్నం గణేశ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

యలమంచిలి రూరల్ : స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకున్న ఒక విద్యార్థి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ మంగళవారం చెప్పారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పీడీ డాక్టర్ పోలిరెడ్డి ఆ విద్యార్థిని అభినందించారు. వివరాల్లోకి వెళితే యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2017-22 వరకూ బీకాం, అనంతరం ఎంకాం చదివిన కళాశాల పూర్వ విద్యార్థి అన్నం గణేశ్ ఇటీవల చైనాలో జరిగిన అంతర్జాతీయ పారా ఒలింపిక్ పోటీల్లో మన దేశం తరఫున పాల్గొని బీచ్ వాలీబాల్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో రజత పతకం సాధించిన గణేశ్‌కు భారత ప్రభుత్వం పారా ఒలింపిక్ వాలీబాల్ ఫెడరేషన్ సర్టిఫికెట్‌ను అందజేసింది. మన దేశం తరఫున అంతర్జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించి, ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించిన విద్యార్థి గణేశ్‌ను స్పోర్ట్స్ కోటాలో గ్రూప్ -సీ కేటగిరీకి అధికారులు ఎంపిక చేశారని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ మేరకు అసోసియేషన్ కళాశాలకు పంపిన సర్టిఫికెట్‌ను మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, పీడీ పోలిరెడ్డి గణేశ్‌కు అందజేశారు. గణేశ్‌ను,అతనికి శిక్షణ ఇచ్చిన పీడీని సహచర అధ్యాపకులు అభినందించారు. క్రీడలలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ఏ రంగంలోనైనా పట్టుదలతో శ్రమిస్తే విజయం సాకారమౌతుందని పీడీ పోలిరెడ్డి విద్యార్థులకు సూచించారు.

తమ్ముడిని చూడడానికి వచ్చి...

- కారు ప్రమాదంలో అన్న దుర్మరణం
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన కారు


సంఘటన స్థలంలో నాని మృతదేహం


మృతుడు నాని (ఫైల్)

నాతవరం : అనారోగ్యంతో ఉన్న తమ్ముడిని చూడడానికి వచ్చిన సోదరుడు కారు దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన మండలంలో చోటు చేసుకుంది. కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి నాతవరం పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వై.నాగరాజు అందించిన వివరాలిలా ఉన్నాయి. నాతవరం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన బొడ్డు నాని తన స్నేహితులతో కలిసి సోమవారం గొలుగొండ మండలం ధారమఠం తాండవ రిజర్వాయరు చూసేందుకు తన కారులో వెళ్లారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం నుంచి స్నేహితులతో సరదాగా రాత్రి వరకు గడిపారు. రాత్రి కారులో తిరిగి ఇంటికి బయలుదేరి వస్తుండగా వల్సంపేట పంచాయతీ శివారు కొత్త గంగవరం సమీపంలో రోడ్డు మలుపు వద్ద కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న బొడ్డు నాని (25) అక్కడికక్కడే మరణించాడు. మిగిలిన ముగ్గురు గోమి బొబ్బులు, ఈరుడి కిశోర్, ఈరుడి రాహుల్ చిరాగ్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బొబ్బులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించడం జరిగిందని హెచ్‌సీ నాగరాజు తెలిపారు. మృతుడు నాని హైదరాబాదులో సీసీ కెమెరాలు రిపేరు చేసే ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. అనారోగ్యంతో ఉన్న తమ్ముడిని చూసేందుకు రెండు రోజుల క్రితమే కారులో నాతవరం వచ్చాడు. తమ్ముడికి అసుపత్రిలో వైద్యం చేయించి కాలేజీకి వైజాగ్ వెళ్లమన్నాడు. మంగళవారం ఉదయాన్నే హైదరాబాదు వెళ్లడానికి ఇంటి వద్ద సోమవారం అన్నీ సర్దుకున్నాడు. ఈలోపు స్నేహితులు వచ్చి కారులో బయటకు వెళ్దొద్దామని అనడంతో బయలు దేరారు. మృతుడి తండ్రి గత ఏడాది అనారోగ్యంతో మరణించాడు. వచ్చే నెలలో నానికి వివాహం చేసేందుకు ఏర్పాట్లలో తల్లి ఉండగా ఈ దుర్ఘటన చోటు చేసుకోవడంతో భోరున విలపిస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మాకవరపాలెం : కుటుంబ కలహాలతో ఒక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒడిశా రాష్ట్రం భరత్‌పుర్‌కు చెందిన సాకేతు రాము(38) గత కొన్నేళ్లుగా మండలంలోని యరకన్నపాలెం వచ్చి తోటమాలిగా పనిచేస్తున్నాడు. అయితే తామరం జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇవ్వడంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని భార్య అపర్ణతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో సొంత గ్రామం వెళ్లిపోదామని భార్య తరచూ గొడవ పడుతోంది. దీంతో మనస్తాపానికి గురైన రాము మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

చెవి దుద్దుల చోరీ

మునగపాక : మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం చోరీ సంఘటన జరిగింది. వివరాలివి. మునగపాకకు చెందిన దాడి లక్ష్మి తన చిన్న కుమారుడు, కోడలితో కలిసి నివాసం ఉంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం కుమారుడు, కోడలు బయటకు వెళ్లారు. లక్ష్మి బట్టలు ఆరబెట్టేందుకు ఆరు బయటకు వచ్చింది. ఆ సమయంలో ఆగంతకుడెవరో ఇంటిలోకి చొరబడి బీరువాలో ఉన్న ముప్పావుతులం చెవి దుద్దులను అపహరించుకుపోయే క్రమంలో చప్పుడు గమనించిన లక్ష్మి కేకలు వేసింది. అయినా ఫలితం లేకపోయింది. అప్పటికే అగంతకుడు పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పి.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26న తాండవ నీటి విడుదలపై సమావేశం

నాతవరం: ఆయకట్టుకు తాండవ రిజర్వాయర్ నీటి విడుదల కోసం ఈనెల 26వ తేదీన రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. నాతవరం తాండవ ప్రాజెక్టు సెక్షన్ కార్యాలయంలో ఆయకట్టుదారులు, రైతులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఆరోజు వారందరి అభీష్టం మేరకు ఖరీఫ్ పంట సాగుకు తాండవ నీరు విడుదల చేసే తేదీని ఖరారు చేస్తామన్నారు.

ఫార్మాసిటీ ప్రమాదంలో కార్మికుడి మృతి


ప్రమాదంలో మృతి చెందిన కబీరాజ్ సాహు

పరవాడ : పరవాడ జవహర్ లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో స్మైలెక్స్ లేబొరేటరీస్‌లో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన కాంట్రాక్టు కార్మికుడు కబీరాజ్ సాహు(58) ప్రాణాలు కోల్పోయాడు. ఈ ప్రమాదంపై పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన కబీరాజ్‌సాహు స్మైలెక్స్ పరిశ్రమలో ప్రాసెస్ యూనిట్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం విధులకు వెళ్లిన కబీరాజ్ సాహు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో చేతులు కడుక్కోవడానికి వెళ్లి అకస్మాత్తుగా వాక్యూమ్ పంపుపై పడిపోయాడు. దీంతో పంపులో తిరుగుతున్న ఫ్యాన్‌కు చేయి తగిలి తెగిపడి తీవ్ర రక్తస్రావమైంది. పొట్ట భాగంలో కూడా తీవ్ర గాయమైంది. అతడిని చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ప్రమాద స్థలాన్ని పరవాడ డీఎస్పీ పి.సత్యనారాయణ సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పీసీబీ అధికారులు ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.

మత్స్యశాఖలో కుర్చీలాట

- తరచూ జేడీలకు బదిలీలు


జాయింట్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన విజయను అభినందిస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట (విశాఖ): మత్స్యశాఖలో కుర్చీలాట సాగుతోంది. ఇక్కడ జేడీగా పనిచేసే అధికారులెవరినీ ఎక్కువ కాలం ఆ సీటులో ఉంచడం లేదు. బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల్లోనే వారిపై బదిలీ వేటు పడుతోంది. వివరాలివీ.. మత్స్యశాఖలో పని చేస్తున్న అధికారులు తమ పలుకుబడిని ఉపయోగించి జిల్లా జాయింట్ డైరెక్టర్ పోస్టింగ్ తెచ్చుకుంటున్నారు. ఆ తర్వాత బాధ్యతలు స్వీకరించి.. అవగాహన కల్పించుకునే లోపలే వారికి స్థానచలనం అవుతోంది. తాజాగా ఇన్‌చార్జి జేడీగా ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విజయకృష్ణను వెనక్కి పంపారు. అతని స్థానంలో విజయను నియమించారు. ఆమె మంగళవారం ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. విజయకృష్ణ ఇదే కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. కాగా.. కాకినాడ జేడీ కార్యాలయంలో పని చేస్తున్న విజయను ఇక్కడ నియమించారు. అక్కడ జీతం, ఇక్కడ విధులు పద్ధతిలో పోస్టింగ్ కల్పించారు. ఇటీవల కాలంలో మత్స్యశాఖలో జేడీలు తరచూ మారుతున్నారు. గతంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసిన పి.లక్ష్మణరావును అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో జి.విజయ జేడీగా బాధ్యతలు స్వీకరించారు. ఆమెను కొద్ది రోజులకే బదిలీ చేశారు. ఆ తర్వాత జాయింట్ డైరెక్టర్ ఎస్.కె.లాల్ మహమ్మద్‌ను నియమించారు. మత్స్యశాఖ కార్యాలయంలో మహిళా ఉద్యోగితో ఆయన అసభ్యకరంగా ప్రవర్తించడంతో వనటౌన్ పోలీస్ స్టేషన్‌లో లైంగిక వేధింపుల కేసు నమోదైంది. దీంతో ఆయన్ని జేడీ బాధ్యతల నుంచి తప్పించారు. ఆయన స్థానంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, గ్రూప్-1 అధికారి ఎం.విజయకృష్ణను ఇన్‌చార్జి జేడీగా పోస్టింగ్ ఇచ్చారు. తాజాగా విజయ జాయింట్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇక్కడ జేడీగా నియమితులవుతున్న వారికి పూర్తి అదనపు బాధ్యతల (ఎఫ్ఏసీ)తోనే ఉత్తర్వులు వెలువడుతున్నాయి.

నవోదయ విద్యాలయం అభివృద్ధికి సహకారం

- కలెక్టర్ హరేందర్ ప్రసాద్ హామీ
- మైగ్రేషన్ విద్యార్థులతో మాటామంతి


సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందర్ ప్రసాద్

మహారాణిపేట: కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యాలయం అభివృద్ధికి సహకారం అందిస్తామని కలెక్టర్ హరేందర్ ప్రసాద్ హామీ ఇచ్చారు. మంగళవారం కొమ్మాదిలోని నవోదయ విద్యాలయంలో మేనేజ్‌మెంట్ కమిటీ(వీఎంసీ) సమావేశం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది. పలు విషయాలపై చర్చించారు. విద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ఎస్.చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు సంబంధించిన విషయాలను వివరించారు. ఈ సందర్భంగా మైగ్రేషన్ కింద మధ్యప్రదేశ్ రాష్ట్రం గుణ జిల్లా జవహర్ నవోదయ విద్యాలయం నుంచి వచ్చిన విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. బోధన విషయంలో అక్కడికి, ఇక్కడికి భిన్నంగా ఏమైనా ఉందనా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి తల్లిదండ్రులతో కలెక్టర్ మాట్లాడారు.

పారా అథ్లెటిక్ విజేతకు అభినందన

విద్యాలయం విద్యార్థిని తేజస్విని ఇటీవల బెంగళూరులో నిర్వహించిన పారా అథ్లెటిక్ పోటీల్లో లాంగ్ జంప్‌లో స్వర్ణ పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో రజితం సాధించింది. ఈ సందర్భంగా తేజస్వినిని కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో డీఈవో చంద్రకళ, విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఫణికుమార్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలు బలోపేతం

పెందుర్తి: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసే దిశగా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేస్తామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరిందర్ ప్రసాద్ అన్నారు. పెందుర్తిలోని జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో విశాఖ జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘంలోని సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. గ్రామాల్లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించిన మహిళలను 'నల్ జల్ మిత్ర'లుగా గుర్తించి గ్రామీణ నీటి సరఫరా నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ శిక్షణను ప్రారంభించారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ సందర్శించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులు, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకదుర్గమ్మకు అర కిలో వెండి బహూకరణ



అమ్మవారి ఆలయంలో పీవీ రమణకు వెండిని అందిస్తున్న పందిరి రామారావు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ అమ్మవారికి శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన పందిరి రామారావు అర కిలో వెండి బహూకరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పలాసలో నివాసం ఏర్పరచుకుని వ్యాపారం చేస్తున్నా, తన స్వగ్రామం అనకాపల్లి కావడంతో అమ్మవారిపై భక్తి ఎక్కువన్నారు. అందుకే తన వంతుగా అమ్మవారికి వెండి బహూకరించినట్లు తెలిపారు. అనంతరం ఆయన్ని ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్ఎం నాయుడు, బుద్ధ భూలోకనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ



డెంగ్యూపై అవగాహన ర్యాలీలో పీహెచ్‌సీ సిబ్బంది

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు తిరుపతిరావు, వై.యశోదల ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ నిల్వ నీటిలో తోమలు గుడ్లు పెట్టి, వాటి సంతతి వ్యాప్తి చెందుతుందన్నారు. దోమల నియంత్రణకు వారంలో ఓ రోజు పాత్రలన్నీ ఖాళీచేసి ఆరబెట్టుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, ఇళ్లలో పొగబెట్టుకుని దోమలను బయటకు తరిమేసే చర్యలు చేపట్టాలన్నారు. డెంగ్యూ వ్యాధి సోకిన వారిలో అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల నొప్పి, కండరాల నొప్పులు, చర్మం ఎర్రబారటం, దద్దుర్లు, డయేరియా, వాంతులు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని వైద్యం పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ, సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ వ్యవస్థాపక దినోత్సవం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో మెయిన్ గేటు వద్ద బీఎంఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఎంఎస్ జెండాను ఆ సంఘం అఖిల భారత ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు ఆవిష్కరించారు. రాష్ట్ర కోశాధికారి లాలం ప్రసాద్ మాట్లాడుతూ భారతీయ మజ్దూర్ సంఘ్ 70వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బొట్టా రమణ, ప్రధాన కార్యదర్శి కూండ్రపు సతీష్, గొర్లి నాగభూషణం, బండారు బాలాజీ, బండారు నరసింహమూర్తి, టి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ప్రభుత్వ జూనియర్ కళాశాల: రాజా

కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-2
డార్లింగ్	: షిర్డీసాయి
భారతీయుడు 2	: పర్తిసాయి
సీడీ	: వెంకటేశ్వర
డిమోంటే కాలనీ	: శ్రీసత్య
బర్త్‌డే బాయ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 77 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-28 యూనిట్లు, ఓ పాజిటివ్-37 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 384 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 532 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

నారుమడిలో నీళ్లు.. రైతు కంట కన్నీళ్లు

అతివృష్టి, అనావృష్టి.. ఏది వచ్చినా నష్టపోయేది రైతులే. విత్తనాలు చల్లినపుడు నీటి చుక్క కోసం ఆశగా ఆకాశానికి.. భారీ వర్షాలకు పొలాలు నీట మునిగితే దిగాలుగా నేలకేసి చూడం రైతుకు అలవాటే. ఆరంభంలో వర్షాల్లేక వేసిన నారు ఎండిపోతోందని దిగాలుపడ్డారు. తీరా వారం రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలో 250 ఎకరాల్లో నారు మడులు నీట మునగడంతో ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం త్వరితగతిన నష్ట అంచనాలు రూపొందించి, పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



నీట మునిగిన వరి నారును వెలికి తీసి చూపుతున్న రైతు



తుమ్మపాల పొలాల్లో వర్షపు నీరు దిగువకు పోయేలా పుల్లకాలువలో పూడిక తొలగిస్తున్న దృశ్యం

- భారీ వర్షాలకు నీట మునిగిన నారు మడులు
- నష్ట పరిహారం, ఉచిత విత్తనాల కోసం నివేదన
- ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతుల ఆశ

అనకాపల్లి: ఖరీఫ్ వరి నారుమడులు, ఎదజల్లిన పొలాలపై వరుణుడు కన్నెర్ర చేశాడు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో వేసిన నారు మడులు చాలా వరకు నీట మునిగాయి. దీంతో పెట్టిన పెట్టుబడి పోయి, అదనపు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రైతు భరోసా పెట్టుబడి సాయం రాలేదు. ఈ సమయంలో భారీ వర్షాలకు వరినారు నష్టపోవడంతో రైతులు గుబులు చెందుతున్నారు.

వరి సాగు లక్ష్యం 5 వేల ఎకరాలు

అనకాపల్లి మండలంలో ఈ ఏడాది సుమారు 5 వేల ఎకరాల్లో వరి పంట సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ మేరకు సుమారు 250 ఎకరాల విస్తీర్ణంలో నారుమడులు వేసుకున్నారు. వర్షాధారంగా 70 ఎకరాల్లో, డ్రిప్ ఇరిగేషన్ సాయంతో 180 ఎకరాల్లో నారు జల్లారు. దీంతోపాటు పలు చోట్ల ఎద పద్ధతిలో విత్తనాలు వేశారు. నారుమడులు వేసినప్పటి నుంచే పొలాలను దమ్ముపట్టి, నాట్లకు సిద్ధం చేసుకున్నారు. మరో నాలుగైదు రోజుల్లో వరి నారు అందుబాటులోకి వచ్చి, నాట్లు వేస్తారనుకున్న తరుణంలో భారీ వర్షాలు తీరని నష్టాన్ని మిగిల్చాయి.

వర్షపు నీటితో మండలంలోని పొలాలన్నీ దాదాపుగా నీట మునిగాయి. సాళ్లు/బోదుల ద్వారా దిగువకు ఎంతగా నీటిని పంపుతున్నా, ఎగువ నుంచి వచ్చే నీటితో నారు కనిపించే పరిస్థితి ఇప్పటికీ లేదు. దీంతో ఎక్కడ నారు కుళ్లిపోయి, నాట్లకు పనికిరాకుండా పోతుందోనన్న భయం రైతుల్ని వెంటాడుతోంది.

ప్రభుత్వ సాయమే దిక్కు!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంట నష్టం కలిగిన రోజుల వ్యవధిలోనే నష్ట అంచనాలు రూపొందించి, పరిహారం అందించేవాళ్లు. దీనికితోడు ఏటా ఖరీఫ్ సీజన్లో పెట్టుబడి సాయంగా రైతు భరోసా ఠంచనుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేది. ఈ ఏడాది కేంద్రం విడిల్చిన అరకొర నిధులు తప్ప, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో గుప్పించిన రూ.20 వేల రైతు పెట్టుబడి సాయం ఊసే లేదు. దీంతో అప్పులు చేసి మరీ, రైతులు విత్తనాలు చల్లారు. ఇప్పుడీ వర్షాలతో నారు మడులకు నష్టం వాటిల్లడంతో రైతుల ఆవేదన వర్ణనాతీతం. ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయ అధికారుల ద్వారా నష్ట నివేదికలు రూపొందించి, పరిహారంతోపాటు, ఉచితంగా విత్తనాలు అందించాలని కోరుతున్నారు.

రైతుకు మిగిలేది కన్నీరే..



సాంప్రదాయ పంట సాగులో రైతుకు ఎప్పుడూ పెద్దగా మిగులు ఉండదు. తన శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కేది చాలా తక్కువ మందికే. ప్రతిసారీ రైతు పండించిన పంటకు నష్టమే మిగులుతోంది. ఈ ఏడాది ఆదిలోనే ప్రకృతి కన్నెర్ర చేసింది. భారీ వానలకు వరి నారుమడులు మునిగిపోయాయి. మాలాంటి రైతుల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి. పంట కాలువల పూడిక తీత పనులు సమయానికి చేసుంటే.. ఇంతగా పొలాల్లో నీరు నిలిచేది కాదు. – చదరం చిన్న, రైతు, తుమ్మపాల

ఉచితంగా విత్తనాలు అందించాలి



తాజా వర్షాలకు చాలా చోట్ల నారు మడులకు నష్టం వాటిల్లింది. మేం వేసిన నారు మడి కూడా పూర్తిగా నీట మునిగింది. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారంతోపాటు, మళ్లీ నారు జల్లుకునేందుకు వీలుగా ఉచితంగా వరి విత్తనాలు అందించాలి. నారు మడుల నష్టంపై త్వరితగతిన నివేదికలు సిద్ధం చేసి, రెండు మూడు రోజుల్లోగా ప్రభుత్వ సాయం అందేలా చూడాలి. అలా అయితేనే రైతులు మళ్లీ వరిసాగుకు ధైర్యం చేయగలరు.

– వేగి కన్న అప్పారావు, రైతు, అనకాపల్లి

ప్రభుత్వానికి నివేదిస్తాం

ఐదు రోజులుగా క్షేత్రస్థాయికి వెళ్లి వరి నారుమడులను పరిశీలిస్తున్నా. చాలా ప్రాంతాల్లో నారు మడుల్లో నీరు చేరింది. నీటిని తొలగించేలా రైతులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించాం. తుమ్మపాల పరిధి పొలాల్లో నీరు నిలిచిపోకుండా పుల్లకాలువలోని చెత్తాచెదారాన్ని జేసీబీ సాయంతో తొలగించాం. వర్షపు నీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకున్నాం. నారుమడులు నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం.

– పీయూటీపీ రంగాచారి, మండల వ్యవసాయ అధికారి, అనకాపల్లి

వైభవంగా పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



పైడితల్లమ్మను దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామదేవతల ఉత్సవాలను నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సూచించారు. మండలంలోని కొప్పాక గ్రామంలో పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం నుంచి వచ్చే ఏడాది జనవరి వరకు వివిధ గ్రామాల్లో గ్రామ దేవతల ఉత్సవాలు జరుగుతాయని, భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం భరత్‌కుమార్‌ను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయిన మురళీమోహన్, సకల రమణ, ఎన్.నాగేశ్వరరావు, చేబోలు సత్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'పై' అంచనా విలువ దినోత్సవం



వెదురుపర్తి హైస్కూల్లో గణిత సంఖ్య 'పై' ప్రాధాన్యం తెలిపే ప్లకార్డులతో విద్యార్థులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం గణితంలో అకరణీయ సంఖ్య అయిన 'పై'(22/7) అంచనా విలువ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'పై'విలువ తెలుసుకునేందుకు వృత్తాకారంలో ఉన్న భోజన ప్లేట్లను తీసుకొని దాని పరిధి, వ్యాసంను విద్యార్థులు లెక్కించారు. వివిధ ప్లేట్ల పరిమాణం వేరుగా ఉన్నా పై విలువ దాదాపు సమానంగా రావడాన్ని నిరూపించారు. దీంతో వీరిని హెచ్ఎం జీవీకే ఆచారి అభినందించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు మూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వెంకన్న పవిత్రోత్సవాలు



వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తికి చక్రస్నానం చేస్తున్న అర్చకులు



ధ్వజస్తంభం వద్ద మహా కుంభాభిషేకంలో అర్చకులు, భక్తులు

అనకాపల్లి: దేవదాయశాఖ ఆధ్వర్యంలోని దేముని గుమ్మం అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల ముగింపు కార్యక్రమాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం గిరిబాబు, విజయబాబుల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, శ్రీవారి చక్రస్నానం, మధ్యాహ్నం పూర్ణాహుతి, కుంభాభిషేకం, అష్టోత్తర శతకలశ, సహస్ర కలశ స్నపనం, మహా కుంభాభిషేకం, సాయంత్రం లక్ష తులసీ కుంకుమార్చన, భగవద్గీత పారాయణం, రాత్రి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పులఖండం గిరిబాబు మాట్లాడుతూ దేవాలయానికి సుమారుగా 400 ఏళ్ల చరిత్ర ఉందని, 1870లో ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ జరిగిందన్నారు. అది జరిగి వందేళ్లు పూర్తయిన సందర్భంగా తొలిసారిగా వజ్ఝల నరసింహాచార్యుల ఆధ్వర్యంలో 11970లో పవిత్రోత్సవాలు ప్రారంభించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఏటా పవిత్రోత్సవాలను పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 17న ప్రారంభమైన పవిత్రోత్సవాలు వారం రోజుల పాటు ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాజసులోచన, అర్చకులు ప్రసాద్, రాజేష్, భక్తులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ఫిజియో సేవలు



కశింకోట భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలందిస్తున్న గీతామౌనిక

కశింకోట: స్థానిక భవిత కేంద్రంలో శారీరక దివ్యాంగుల కోసం పునఃప్రారంభమైన ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని ఎంఈవో చిట్టిబాబు కోరారు. ఫిజియోథెరపీ సేవలను మంగళవారం ప్రారంభించి, మాట్లాడారు. మండలంలోని శారీరక దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రతి మంగళవారం ఇక్కడ ఫిజియో సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. దీంతో శారీరక దివ్యాంగుల్లో మానసిక స్థైర్యం పెరిగి, అందరు విద్యార్థుల మాదిరిగానే ఆనందంగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు, బాలికల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రామునాయుడు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు రమణమ్మ, దీప, ఫిజియోథెరపిస్ట్ పి.గీతా మౌనిక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కెప్టెన్ లక్ష్మీ సెహగల్ సేవలు చిరస్మరణీయం

కశింకోట: మండలంలోని తేగాడలో స్వాతంత్ర్య సమరయోధులు కెప్టెన్ లక్ష్మీ సెహగల్ వర్ధంతిని ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి ఐద్వా అధ్యక్షురాలు బి.ప్రభావతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో కెప్టెన్ హోదా పొంది, వృత్తి రీత్యా వైద్యురాలిగా సెహగల్ అందించిన సేవలను ప్రస్తుతించారు.

కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి, జిల్లా నాయకులు యు.నాగమణి, ఎం.శ్రీదేవి, జి.వెంకటలక్ష్మి, పి.అమ్మాజీ, ఎం.ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలి

అనకాపల్లి: పరవాడ ఫార్మాసిటీలోని స్మైలెక్స్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి, మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి నష్టపరిహారం అందించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వీవీ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో ఒరిస్సాకు చెందిన కబీ అనే కార్మికుడు మృతి చెందడం బాధాకరమన్నారు. ఇటీవల అచ్యుతాపురం, రాంబిల్లిలో జరిగిన ప్రమాదాలు మరువకముందే మరో ప్రమాదం సంభవించిందన్నారు. ఫార్మా పరిశ్రమల్లో భద్రతా చర్యలు, ప్రమాదాలపై కలెక్టర్ సమావేశాలు నిర్వహించిన వారం రోజుల్లోపే రెండు ప్రమాదాలు జరగడం దారుణమన్నారు. పరిశ్రమలకు లాభాలే పరమావధిగా ఉన్నాయని, భద్రత చర్యలు, సేఫ్టీ ఆడిట్లు అత్యంత లోప భూయిష్ఠంగా మారడం వల్లే ప్రమాదాల్లో అమాయక కార్మికులు మరణిస్తున్నారని ఆరోపించారు.

మర్యాదపూర్వక కలయిక



జీవీఎంసీ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్పొరేటర్ సునీత దంపతులు

అనకాపల్లి: జీవీఎంసీ నూతన కమిషనర్ పి.సంపత్‌కుమార్‌ను అనకాపల్లి 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు మంగళవారం పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. జీవీఎంసీలోని కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఆయన్ని కలిశారు. ఈ సందర్భంగా వారు కమిషనర్‌తో మాట్లాడుతూ అనకాపల్లి జోన్ పరిధిలో ఇటీవల వర్షాలకు ప్రధాన రహదారుల్లో గోతులుపడి, వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

27 వరకు సచివాలయాల్లో ఆధార్ సేవలు



అంజయ్యకాలనీ ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జెడ్సీ అయ్యప్పనాయుడు

అనకాపల్లి: ప్రతి వ్యక్తికి ప్రభుత్వం ఉచిత ఆధార్ నమోదు చేస్తుందని జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 27 వరకు జోన్ పరిధిలోని ఐదు సచివాలయాల్లో ఆధార్ సేవల్ని అందించనున్నట్లు వెల్లడించారు. స్థానిక గాంధీనగరం(అంజయ్యకాలనీ) సచివాలయం-1 పరిధిలో నిర్వహిస్తున్న ఆధార్ సేవాకేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జోన్ పరిధిలో అంజయ్యకాలనీ, శ్రీరామ్‌నగర్, సతకంపట్టు, కేఎన్ఆర్‌పేట సిరసపల్లి, నర్సింగరావుపేట సచివాలయాల్లో కొత్తగా ఆధార్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కొత్త ఆధార్ కార్డులు, మార్పులు, చేర్పులకు ఈ సెంటర్లను వినియోగించుకోవాల్సిందిగా సూచించారు. ప్రతి ఒక్కరికీ ఆధార్ తప్పనిసరని, ఐదేళ్లు దాటిన పిల్లలు మరోసారి ఆధార్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, జోన్ సిబ్బంది పాల్గొన్నారు.

పొలంబడిలో నారుమడుల పరిశీలన



పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి రంగాచారి

అనకాపల్లి: నారుమడుల్లో వర్షపునీరు నిల్వలేకుండా రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పీయూటీపీ రంగాచారి అన్నారు. మండలంలోని సీతానగరంలో పొలంబడి, సీడ్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి మంగళవారం క్షేత్ర పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమకు కావలసిన విత్తనాలను తామే తయారు చేసుకునేలా సీడ్ విలేజ్ ప్రోగ్రాం ఉపయోగపడుతోందన్నారు. పొలంబడిలో భాగంగా వరి నారుమడులను సందర్శించి ప్రతి ఐదు సెంట్లకు 2 కిలోల యూరియా, 2 కిలోల పొటాష్ చల్లుకోవడం ద్వారా చీడ పీడలను తట్టుకుని నారు ఆరోగ్యవంతంగా ఎదుగుతుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నారుమడులలో చేయాల్సిన యాజమాన్య పద్ధతుల్ని రైతులకు వివరించారు.

కార్యక్రమంలో ఆత్మ ఏపీఎం పి.రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్, వీఏఏలు, రైతు నాయకులు తెల్లాకుల ప్రకాష్, పొలమర శెట్టి గోవిందరాజు, గంగుపాం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి లబ్ధిదారుల ఎంపిక



జమాదులపాలెంలో పండ్ల తోటల రైతులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషుబాబు

కశింకోట: పండ్ల తోటల పెంపకం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని ఎంపీడీవో శేషుబాబు అన్నారు. మండలంలోని జమాదులపాలెంలో సుమారు 40 ఎకరాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలను పెంచేందుకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పథకంలో పండ్ల తోటల పెంపకానికి, సంరక్షణకు, ఎరువులు వేయడానికి మూడేళ్ల వరకు సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఎకరాకు సుమారు రూ.95 వేల వరకు లబ్ధి కలుగుతుందన్నారు. మండలంలో ఉపాధి పథకంలో ఈ ఏడాది 108 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు మామిడి, జీడి మామిడి, కొబ్బరి మొక్కలు పెంపకానికి అందివ్వాలని కోరారు. ఏపీవో శివ, సర్పంచ్ రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బోధనాభ్యసన సామగ్రితో మెరుగైన బోధన



కశింకోట డీపీఎన్ హైస్కూల్లో బోధనా పద్ధతుల్ని వివరిస్తున్న హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు



వెదురుపర్తి హైస్కూల్లో విద్యార్థులు ప్రదర్శిస్తున్న టీఎల్ఎం చార్టులు

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం మంగళవారం ప్రారంభమయింది. ఈ సందర్భంగా హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనాభ్యసన సామగ్రిని వినియోగించి, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను వివరించాలన్నారు. ఈ మేరకు బోధనాభ్యసనలో ఉపయోగించే టీఎల్ఎం మెటీరియల్, చార్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈవోలు చిట్టిబాబు, మూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలోని వెదురుపర్తి హైస్కూల్లో కూడా శిక్షా సప్తాహ్ కార్యక్రమం జరిగింది. హెచ్ఎం జీవీకే ఆచారి ప్రారంభించారు. గణితం, సామాన్య శాస్త్రంలో ప్రాథమిక అంశాలపై అవగాహనకు ఆటలు, పాటలు, కథలు, వివిధ నమూనాల ద్వారా వివరించారు.

వరి నారు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కర్రి అప్పారావు

అనకాపల్లి: జిల్లాలో ఈ నెల 16 నుంచి 22 వరకు కురిసిన భారీ వర్షాల కారణంగా అచ్యుతాపురం, మునగపాక, అనకాపల్లి, రాంబిల్లి మండలాల్లో వేసిన వరినారు, డ్రిల్ సీడ్ నీట మునిగి విత్తనాలు మొలకెత్తకుండా పాడైపోయినట్లు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల కారణంగా రైతులు ఎకరాకు రూ.ఏడెనిమిది వేలు వరకు నష్టపోయారని తెలిపారు. వరి పంట వేయాలంటే మళ్లీ రైతులు నారు మడులు వేయాల్సిందేనని, అయితే రైతుల వద్ద విత్తనాలు అందుబాటులో లేవన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నారుమడులు నష్టపోయిన రైతులకు ఉచితంగా విత్తనాలు అందించడంతోపాటు, ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, నాయకులు బుద్ధ రంగారావు తదితరులు పాల్గొన్నారు